
● ఈ వారం
ప్రేమకథ

# మల్లెపూల మౌనం



◆ అక్కపెద్ది
వెంకటేశ్వర శర్మ

## "మాంచి మూడ్‌లో వున్న ఏ రాత్రి వేళో మీ ఆవిడ కసిక్కున నీ బుగ్గని కొరికేసిందనుకో... ఏమనిపిస్తుంది?...

బుగ్గ భగ్గుమని మండిపోదూ... ఒళ్లంతా ఒక్కసారిగా జివ్వుమనిపించదూ... అయితేనేం... ఆ మంటలో కూడా తియ్యటి మాధుర్యం మనసుని మత్తుగా చుట్టేయదూ... మంటెక్కినా మూడో నాలుగో క్షణాల తర్వాత మళ్లీ అలా చేస్తే యింకా హాయిగా వుంటుందని లోలోపల అనిపించదూ... సరిగ్గా మొగుడు పెళ్ళాల మధ్య చిలిపి కోపాలు – విరహతాపాలూ కూడా అలాంటివేరా మనవడా"–

కురుక్షేత్రం సీన్‌లో శ్రీకృష్ణుడు అర్జునుడికి గీతా రహస్యాన్ని బోధిస్తే ఆ గదిలో అరవయ్ ఎనిమిదేళ్ళ తాతగారు పాతికేళ్ళ మనవడికి శృంగార రహస్యాన్ని విశదీకరిస్తున్నారు.

"నీకు తెలియదు తాతయ్యా... పెళ్లయి ఆరు నెలలేగా అయింది. ఈ కొద్ది రోజుల్లోనే దాంతో బోర్ కొట్టేసిందంటే ఆలోచించు – నేనెంతగా ఫీలయిపోతున్నానో"

తన ముందు పావుగంట నించీ కొత్త కాపురంలో కలతలని గురించి ఏకరువు పెడుతున్న మనవడు రాంబాబు వేపు కళ్లు పెద్దవి చేసి చూస్తూ అడిగారు భక్తవత్సలంగారు.

"ఏంటిరా మనవడా మరోసారి చెప్పు... ఏంట

న్నావ్... సువర్చల నీకు ఆరు నెలల్లోనే 'బోర్' కొట్టేసిందా"

తన మాటలో ధ్వనించిన తప్పకి గతుక్కుమన్నాడు రాంబాబు. అంతలోనే భార్య ప్రవర్తన గుర్తొచ్చి రోషంగా అన్నాడు.

"బోరు కొట్టడమంటే... భరించలేక పోతున్నాననే... అయినా చీటికి మాటికీ అలిగి దుంపతెంపేదానితో ఎలా వేగేది? అసలు మన కోనసీమ మీద తుఫాను ఎప్పుడు విరుచుకు పడుతుందోనైనా చెప్పగలమేమోగానీ సువర్చల ఎప్పుడు 'అలక సీన్' మొదలెడుతుందో చెప్పలేం... దాంతో వేగడం నా వల్ల కావడం లేదు".

నెరిసిన గుబురు మీసాల చాటునించి చిన్నగా నవ్వారు భక్తవత్సలంగారు.

కొడుకు కోడలూ రాంబాబుకి నాలుగేళ్ల వయసప్పుడే ఓ రోడ్డు ప్రమాదంలో మరణిస్తే మనవడిని గుండెల్లో దాచుకుని పెంచుకున్నారాయన. తన భార్యా మరణించినా, ఆడ తోడు లేక ఇల్లు గడవడం కష్టంగా తోచినా ఎలాగో యిబ్బందిపడి మనవడిని డిగ్రీ దాకా చదివించారు. బేంక్‌లో ఉద్యోగం వచ్చాక నాలుగైదు సంబంధాలు చూసి రాంబాబుకి తగిన జోడీ అని నమ్మకం కుదిరాకే సువర్చలతో పెళ్ళికి ఒప్పకున్నారు.

పాతిక మైళ్ళ దూరంలోనే కదా! యిక్కడనించే వెళ్లివస్తానని మన .వడు నసిగినా కోప్పడి రాజమండ్రిలో వాళ్ల చేత కాపురం పెట్టించారు. కొత్తకాపురంలో మనవడు ఏకాంతంగా పెళ్లాంతో హాయిగా రోజుల్ని గడిపేస్తాడు గదా! అనుకునేంతలో ఆ పూట సాయంత్రం ఒక్కడే బస్సు దిగాడు రాంబాబు.

వచ్చినప్పటినుంచి ఒకటే గొడవ – సువర్చల తన మనవడితో నిజంగానే సరిగ్గా కాపురం చేయడం లేదా?

పెళ్లికి ముందే ఆ అమ్మాయితో నాలుగైదుసార్లు మాట్లాడి ఆ పిల్ల మనస్తత్వాన్ని, మంచితనాన్నీ బేరీజు వేశాడే? తన అనుభవం తప్పయిందా లేక మనవడే తప్పగా ఆలోచిస్తున్నాడా?

ఒక్క వయస్సులో తేడా తప్ప ఊహ తెలిశాక రాంబాబుని తనేనాడూ పిల్లాడిలా పెంచలేదు. ఓ స్నేహితుడిగానే చూశాడు. అందుకే ఎలాంటి సమస్య వచ్చినా తనతో డైరెక్ట్‌గా చెప్పకుంటాడు.

"అంటే ఏంటంటావ్?" ఆలోచనల్లోంచి బయటపడుతూ అడిగారు భక్తవత్సలంగారు.

ఏమనాలో తోచలేదు రాంబాబుకి. సువర్చలలో ఒక్క గుణమే తనకి నచ్చనిది. ఏ క్షణంలో కోపగిస్తుందో తెలియదు. ఆ ఒక్కటి తప్ప మిగతావన్నీ ఓకేనే.... కానీ అదొక్కటి చాలదూ కొత్తకాపురాన్ని కలతల మయం చేయడానికి?

"కోపమంటే... అసలంతగా సువర్చలకి కోపం రావడానికి కారణం ఏమై వుంటుందంటావ్?"

"ఏమో నాకేం తెల్సు.." తలెగరేశాడు రాంబాబు.

## అనగనగా
## సరికొత్త భార్యాభర్తలు.
## వాళ్ళ మధ్య చిరుతగువు.
## మామూలుదే!
## ఆ తగువుకి
## ఓ తాతగారు ఓ చిట్కా వేసి
## నిలబెట్టిన వైనం...




"సర్లే... ఆఖరి బస్సుకి వెళ్దాం... నేను మాట్లాడతాగా సువర్చలతో" అన్నారాయన ఏదో నిర్ణయానికి వచ్చినట్టుగా.

* * *

భర్తతోపాటే వస్తున్న తాతగారిని చూడగానే అర్ధమైంది సువర్చలకి ఏం జరిగి వుంటుందో. అర్ధమైన కొద్దీ భర్త మీద కోపం రెట్టింపయ్యింది.

"ఏమ్మా బావున్నావా?" ఆప్యాయంగా పలకరించారాయన.

"బావున్నాను. మీ ఆరోగ్యం ఎలా వుంది?" స్టీల్ చెంబుతో నీళ్ళు తెస్తూ చిరునవ్వుతో అంది సువర్చల.

తాతగారొచ్చారని వంకాయ కూర చేసి సాంబారు పెట్టి అప్పడాలు వేయించింది. తృప్తిగా భోం చేశాక వక్కపలుకు నోట్లో వేసుకుంటూ ఆమె వేపు చూశారాయన.

పట్టింట్లో కదలాడే మహాలక్ష్మిలా చిరునవ్వుతో ప్రశాంత వదనంతో కనిపిస్తోంది. ఇలాంటి పిల్ల చీటికి మాటికీ అలుగుతుందంటే నమ్మబుద్ధి కావడం లేదు.

పెరట్లో మంచం వేసి చెంబుతో నీళ్లు పెట్టి దగ్గరే వున్న సిమెంట్ బెంచీ మీద కూచుంది సువర్చల.

తాపీగా మంచంమీద కూచుని ఆకాశం కేసి చూశారాయన.

ఎండాకాలమేమో గాలి బిగించింది. అయినా పెరట్లో వున్న సన్నజాజి పందిరి సువాసనకి మనసు ఆహ్లాదంగా సేద తీరుతోంది.

తెల్లటి పూల ప్రింట్ వున్న కాటన్ చీరలో తల్లో మల్లెపూలతో నిండుగా అందంగా కనిపిస్తోంది సువర్చల. ఇల్లు సర్దడంలో పొందికనీ, వండి వడ్డించడంలో ఆప్యాయతనీ, పలకరింపులోని ప్రేమనీ, అలకరించుకోవడంలోని ఒద్దికనీ చూస్తే ఖచ్చితంగా చెప్పచ్చు – ఆడపిల్ల ఎలాంటిదో!

"ఊ... చెప్పమ్మడూ... ఎలా వుంది కొత్త కాపురం?"

"నాకైతే బాగానే వుంది. మీ మనవడికే బాగా లేనట్టుంది" క్రీగంట చూస్తూ అంది సువర్చల. పక్కనే కుర్చీలో కూర్చున్న రాంబాబు మింగేసేలా చూశాడామె వేపు.

"కొత్తకాపురం అంటే గంధపు చెక్కలాంటిదంటారు. అరగదీసిన కొద్దీ గంధం సుగంధం తప్ప మరేమీ రావు. మరి మీకేంటి... ఆరునెలలకే కోపాలూ రుసురుసలు.. ఏరా మనవడా! ఏమిటి నీ కంప్లెయింటు?" సూటిగా విషయంలోకొచ్చేశారాయన. ఇలాంటి విషయాల్లో నాన్చకుండా డొంకదారి కబుర్లకన్నా యిద్దరూ మంచివాళ్ళే అయినప్పుడు ముఖాముఖీ తేల్చేయడమే మంచిదని తెలుసాయనకి!

"చెప్తాగా. తనకి కోపం తగ్గితేనే గానీ నాకు మనశ్శాంతి వుండదు" ఠపీమని చెప్పాడు రాంబాబు.

ఆయన సువర్చలకేసి చూశారు.

"ఏమ్మా... వాడి మాట అబద్ధం కదూ..."

జవాబు చెప్పలేదు సువర్చల. తలొంచుకుని చేతి వేళ్లకున్న గోరింటాకు ఎర్రదనాన్ని చూసుకుంటూ నిశ్శబ్దంగా వుండిపోయింది.

"చెప్పమ్మాయ్... నేను వాడికి మాత్రమే కాదు – నీకూ తాతగారినే అనుకో నాదగ్గర సందేహించడం దేనికి?"

ఎలా చెప్పాలో తోచనట్టు సందిగ్ధంగా చూసిందామె. ఆమె ఇబ్బందిని గ్రహించినట్టు మనవడికేసి చూస్తూ లోపలికెళ్లమని సైగ చేశారాయన. అయిష్టంగానే లేచి లోపలికెళ్ళాడు రాంబాబు.

రెండు చేతుల వేళ్లనీ బిగిస్తూ అందామె నెమ్మదిగా.

"ఆయన వరసేం బావుండడం లేదు".

అలాంటిదేదో వుంటుందని చూచాయగా గ్రహించారాయన. సువర్చల లాంటి ఒద్దికైన పిల్లక్కూడా కోపం వచ్చిందంటే నిజంగానే తప్ప తన మనవడిలోనే వుంటుందనిపించింది. నాలుగు రోజులుగా భార్యాభర్తల మధ్య మాటలు లేవని విన్నాక వుండబట్టలేకే వచ్చాడాయన. నెమ్మదిగా బుజ్జగించి అసలు విషయం తెలుసుకోవాలి.

"అంటే... ఏంటంటాడు?' అడిగారాయన.

"అంటే..." సందిగ్ధంగా చూస్తోంది సువర్చల.

"ఫర్వాలేదు. చెప్ప తల్లీ" ఆప్యాయంగా అన్నారాయన.

అతికష్టంమీద గొంతు పెగల్చుకుంటోందామె.

"ఇలా దగ్గరగా రా..." అనునయంగా ఆయన పిలవగానే వెళ్లి మంచంమీద కాళ్ళవేపు కూర్చుంది. ఆమె చేతిని తన ఒళ్లోకి తీసుకుని మరో చేత్తో తలనిమురుతూ అడిగారు మళ్ళీ.

"రోగం రట్టు– కాపురం గుట్టు అన్నారు నిజమే– కానీ అయినవాళ్ళ దగ్గర కాదుగా... అసలేం జరిగిందో చెప్ప తల్లీ"

అప్పటిదాకా ఎవరితో చెప్పుకోవాలో, ఎలా చెప్పుకోవాలో తెలియని సువర్చల కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగినయ్. తల్లీ తండ్రీ లేని ఆమె మేనమామ ఇంట్లోనే పెరిగింది. కానీ ఆయన దగ్గర కానీ, అత్తయ్య దగ్గర గాని ఏమాత్రం చనువు లేదామెకి. అలాంటిది తాతగారు తల నిమురుతూ బుజ్జగించి అడిగేసరికి కడుపులోంచి బాధ కన్నీళ్ళుగా బహిర్గతమైంది. ఆయన భుజానికి తలని ఆన్చి వెక్కుతూ చెప్పింది మెల్లిగా.

"కాపురం పెట్టిన మూడు నెలల దాకా హాయిగానే వున్నాం. కానీ ఆ తర్వాతే..." ఆ గొంతులో బాధ, కోపం మిళితమై ధ్వనించడం ఆయన దృష్టిని దాటిపోలేదు.

"ఏమైందమ్మదూ..."

ఒక్కసారి బరువుగా నిట్టూర్చి చెప్పింది సువర్చల.

"మూడు నెలల క్రితం అనుకుంటా. బేంక్‌లో పనిచేసే ఓ కొలీగ్ ఇంట్లో ఓ పాడు సినిమా... అదే నీలిచిత్రమట... చూపొచ్చారుట.. చూసిన విషయాన్ని చెప్పడం మాత్రమే కాదు.. అప్పట్నుంచీ ఆ సినిమాలో ఆడవాళ్లలా... నన్ను.. అసహ్యంగా.."

వింటున్న భక్తవత్సలంగారి ముఖం జేవురించింది.

"అదీ.. అలా నిస్సిగ్గుగా ప్రవర్తించడం నావల్ల కాదన్నాను. నేను కాదనేసరికి ఆయనకి కోపం వచ్చింది. నాలుగు రోజుల క్రితం ఓ రాత్రి మళ్ళీ అదే గొడవ.. నాకు మంటెక్కింది.. దులిపేశాను. అప్పట్నించీ ఇద్దరిమధ్య మాటల్లేవు. అంతే"

"ఓరి భడవా..."అప్రయత్నంగానే ఉచ్చరించినయ్ ఆయన పెదాలు. చిలికి చిలికి గాలివానగా మారుతున్న ఆలుమగల మధ్య కోపతాపాలకు కారణం.. ఓ బ్లూఫిలిమ్?!

ఆ తర్వాతేమీ అడగలేదాయన. అడగకుండానే అర్థమైందాయనకి పూర్తిగా– వాళ్ళ సమస్యేమిటో!

నిజానికి వాళ్ళిద్దరి సమస్య మాత్రమే కాదు–

మీడియా పుణ్యమా అనీ, పాశ్చాత్య నాగరికత ప్రభావం పుణ్యమా అని విచ్చలవిడితనాన్ని కోరుకుంటున్న చాలామంది భర్తలకీ– సంప్రదాయాన్నీ, ఒద్దికనీ, నాజూకుతనాన్ని విడలేని చాలామంది భార్యలకీ ఎదురవుతున్న సమస్య!

**దూరంగా జరిగిన రెండు బెడ్స్‌నీ దగ్గరగా ఎప్పుడు జరిపిందో, రతీదేవిలా అలంకరించుకున్న సువర్చల అతడి మీదకు వంగింది.**

చాలా రాత్రిదాకా ఆలోచించాక ఆ సమస్యకి సమాధానం దొరికిందాయనకి!

* * *

"ఛీ..." ఎర్రగా కందిపోయింది సువర్చల ముఖం ఆయన చెప్పిన విషయం అర్థంకాగానే. చివ్వున తలెత్తింది రోషంగా.

"మీరు.. మీరు.. తాతగారై వుండి.. ఇలా..." ఆ తర్వాత ఏమనాలో తోచనట్టు అసహ్యాన్ని దిగమింగుతున్నట్టుండిపోయింది.

"చాలా ఇబ్బందికరమైన విషయమే ఇది. నిజానికి నేనో మగాడిని కాకుండా ఆడదాన్నయి వుంటే ఇంకా సూటిగా చెప్పగలిగేవాణ్ణి. రాంబాబు లాంటి చాలామంది కుర్రాళ్లలో వింతైన పద్ధతుల్లో శృంగారం ఫీట్స్‌లాంటివే తప్ప నాజూకైన శృంగార భావాలను ఉద్దీపించే పద్ధతులు కావని వాళ్ళకి అర్థం కావాలంటే తప్పదు. ఏదైనా విషయాన్ని వద్దన్నకొద్దీ మనిషి ఆ పనే చేయాలనుకుంటాడు. నేను చెప్పాల్సింది చెప్పాను. నువ్వూ ఆలోచించు..."

మర్నాడుక తాతగారు వెళ్ళిపోయినా ఆ విషయాన్ని గురించే ఆలోచిస్తూ వుండిపోయింది సువర్చల.

రాంబాబు సైలెంట్ వార్‌ని కంటిన్యూ చేస్తూనే భోంచేసి బేంక్‌కి వెళ్ళిపోయాడు.

కేజువల్‌గా టీవీ ఆన్ చేసింది.

ఏదో మూవీ వస్తోంది. హీరో హీరోయిన్లు వాత్స్యాయన నాయికా నాయకుల్లా స్టెప్స్ వేస్తున్నారు.

తప్పదా? తాతగారు చెప్పినట్టు ఆయనలో ఆ 'కోరిక' పక్కదారులు పట్టకుండా వుండాలంటే తనందుకు అంగీకరించాల్సిందేనా?

చాలాసేపటిదాకా ఆలోచించాక ఓ నిర్ణయానికి వచ్చిందామె.

తాతగారన్నట్టుగా... కొన్ని పనులు మనకి ఇష్టం లేకపోయినా చేయక తప్పదు దాంపత్య జీవితంలో!

* * *

రాత్రి పదిగంటలు.

బెడ్‌మీద అటు తిరిగి పడుకున్న రాంబాబు మెత్తగా చెంపని ఏదో స్పృశించడంతో కళ్ళు తెరిచాడు.

దూరంగా జరిగిన రెండు బెడ్స్‌నీ దగ్గరగా ఎప్పుడు జరిపిందో, రతీదేవిలా అలంకరించుకున్న సువర్చల అతడిమీదికి వంగింది. అలా వంగడంతో పొడుగ్గా వున్న జాజిపూల చెండు మెత్తగా అతడి నాసికని తాకింది.

మత్తయిన ఆ వాసన కోరికల తుఫాన్లని సృష్టిస్తుంటే భార్య కళ్ళలోకి చూశాడు.

"సీజ్‌ఫైర్ అంటే తెలుసా..." తన చేత్తో అతడి ఛాతీని నిమురుతూ అడిగింది.

"కండిషన్ తెలుసుగా.." గడుసుగా అడిగాడు రాంబాబు.

అయిష్టంగానే తలూపిందామె.

ఆ తర్వాత భర్త కోరుకున్న పద్ధతిలో అతడి కోర్కెలకి అనుగుణంగా ఒదిగిపోయింది.

భార్య తన ప్రపోజల్‌కి ఒప్పుకున్నందుకు ఎమోషనల్‌గా ఎగ్జయిట్ అయిపోతున్న రాంబాబు సువర్చలలోని మార్పుకు కంగారుపడిపోయాడు.

అక్కడితో ఆగలేదు సువర్చల.

ఆడది బిడియంగా సబ్మిసివ్‌గా వుంటే మగాడు చెలరేగిపోతాడే తప్ప అదే ఆడది ఎగ్రెసివ్‌గా మారితే భయపడి ముడుచుకుపోతాడనీ, ఓడిపోతాడనీ నిరూపించిందా రాత్రి.

అదే మొదటిదీ.. చివరిదీ ఆటువంటి అనుభవం రాంబాబుకి.

ఆ తర్వాత ఏనాడూ వింతైన అనుభవం.. వింతైన కోరికలు కోరలేదతను.

అయినా ఇప్పడతనికి ప్రతిరాత్రీ స్వర్గంగానే కనిపిస్తోంది. కొప్పున మల్లెల్తో భార్య ఎప్పుడు కనిపించినా చప్పున రమ్మన్నట్టుగా ఆత్రపడిపోతున్నాడతను. సగానికి విరిగిపోతుందనుకున్న వాళ్ళ ప్రేమ తాతగారి చిట్కా వల్ల ఆ రకంగా మల్లెమొక్కలా మళ్ళీ చిగురించడంతో ఎంతో ఆనందించిన సువర్చల తాతగారికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పకుంది. ◆